సాయంత్రంలోగా చంపేస్తాం

- ఎంపీ రఘునందన్‌కు బెదిరింపు కాల్

విశ్వంభర, హైదరాబాద్: బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు పీపుల్స్‌వార్ మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఆగంతకుడు ఫోన్ చేశాడు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునంటూ బెదిరించాడు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి ఎంపీ హాజరైన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్ పీఏ లిఫ్ట్ చేశారు. బెదిరింపు కాల్‌పై డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు రఘునందన్ ఫిర్యాదు చేశారు.

గిరిజన బిడ్డలపై అమానుషం: 'ఎక్స్'లో కేటీఆర్ సంచల ట్వీట్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: 'హైదరాబాద్ మీదకే కాదు.. అడవి మీదకూ బుల్డోజర్లు' ఈ ప్రభుత్వం పంపిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో విమర్శించారు. పేదలు అన్న ప్రేమ లేదని.. ఆడబిడ్డలు అన్న ఇంగితం లేదని విమర్శించారు. పోడు భూముల్లో వ్యవసాయం చేసి పొట్టపోసుకుంటున్న ఆదివాసీలపై దాడి అమానుషమని పేర్కొన్నారు. 420 హామీలను అమలు చేయలేక.. ఇవ్వని హామీలు హైడ్రా, మూసా ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇండ్లు కూల్చడం.. రోడ్ల విస్తరణ, పరిశ్రమలకు భూసేకరణ పేరుతో లగచర్ల, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ, చారగొండ, సిరసనగండ్లలో రైతుల పొలాల్లోకి, ఇండ్ల మీదకు బుల్డోజర్లు పంపడం ఇదే ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని పేర్కొన్నారు. పట్నం, పల్లెలు దాటి ఇప్పుడు అడవులు, ఆదివాసీల మీద పడ్డారని ఆరోపించారు. ప్రశ్నిస్తే, ఎదిరిస్తే, నిలదీస్తే నిర్దాక్షిణ్యంగా కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని పేర్కొన్నారు.

జీవిత ఖైదీ అనుభవిస్తూ దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

విశ్వంభర, కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో మర్డర్ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తు పెరోల్ (సత్ప్రవర్తన) పైన బైట తిరుగుతున్న దొంగ ను అరెస్టు చేసిన పోలీసులు.వివరాల లోకి వెలితే మెదక్ జిల్లా,శంకరంపేట్,మండలం,మక్త లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి తండ్రిని చంపిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తు గత నెల 25వ తారీఖున, ఒక నెల రోజుల పాటు పెరోల్ (సత్ప్రవర్తన)పైన బైటకి వచ్చిన గొండ్ల రాములు వాహన చోరీలకు పల్పడుతుండగా పట్టుకున్న దుండిగల్ పోలీసులు.అతని వద్ద దొంగిలించబడిన ఒక ట్రాక్టర్, ఒక కార్,ఒక ద్వి చక్ర వాహనం స్వాధీన పరుచుకుని రిమాండ్ కు తరలించినట్లు దుండిగల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు.

గంజాయి రహిత జిల్లాకు కలిసి పనిచేద్దాం

విశ్వంభర, సిద్దిపేట : గంజాయి రహిత జిల్లాకు కలిసికట్టుగా పనిచేద్దామని రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి అన్నారు. యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వీక్ సందర్భంగా సీపీ అనురాధ ఆదేశాలతో మండలంలోని పుల్లూరులో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అపూర్వ మాట్లాడుతూ మత్తు పదార్థాలను ఆనందం కోసం అలవాటు చేసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని తెలిపారు. గంజాయి సేవించేవారు మానసిక స్థితిని కోల్పోయి నేరాలకు అలవాటయ్యే ప్రమాదముందన్నారు. మత్తు పదార్థాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని, నరాలు, గుండెతోపాటు ప్రధాన అవయవాలు దెబ్బతినే అవకాశముందని తెలిపారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి మొక్కలు నటించారు. కార్యక్రమంలో రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా మాండలిక పరిశోధకుడు తిరుమల రామచంద్ర

విశ్వంభర, హైదరాబాద్ : తెలుగు భాష లో మాండలిక పద ప్రయోగాలలో గుణ దోషాలు పై సాధికార వ్యాసాలు రాసిన తిరుమల రామచంద్ర మాండలిక భాషా పరిశోధకుడు అని తెలంగాణ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్త అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లో ఎందరో మహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా తిరుమల రామచంద్ర యాదిలో కార్యక్రమం గాన సభ నిర్వహణ లో అధ్యక్షుడు కళా విఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. కొల్లేటి దామోదర్ గుప్త మాట్లాడుతూ రామచంద్ర ఆంధ్ర పత్రిక లో ఎన్నో ప్రయోజనాత్మక వ్యాసాలు రాశారని వివరించారు. సీనియర్ పాత్రికేయులు జయసూర్య మాట్లాడుతూ భాషా శాస్త్ర పరిశోధనలో అగ్రగణ్యులు రామ చంద్ర అని వారి రచనలు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాపోషకులు వడ్లకొండ వెంకట రావు, గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



స్థానిక ఎన్నికల నిర్వహణలో జాప్యమెందుకు?

విశ్వంభర, హైదరాబాద్: స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసి ఏడాదిన్నర అయినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవిదేవి సోమవారం విచారణ చేపట్టారు. వాదనల అనంతరం తీర్పును వాయిదా వేశారు. తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. ''గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి

రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి'' అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ..రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.

ఇరాన్ దాడుల వేళ.. ఎయిరిండియా కీలక నిర్ణయం

విశ్వంభర, నేషనల్ బ్యూరో : అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టిన తరుణంలో ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. గల్ఫ్ ప్రాంతం నుంచి వెళ్లే తమ అన్ని విమాన సర్వీసులను తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. తమ తదుపరి నోటీసు వచ్చేవరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని పేర్కొంది. పశ్చిమాసియాలోని దేశాలు, ఉత్తర అమెరికాలోని తూర్పు తీరంలో ఉన్న పలు నగరాలు, యూరప్‌నకు విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఇక ఉత్తర అమెరికా నుంచి ఇండియాకు బయలుదేరిన కొన్ని విమానాలను మళ్లీ వెనక్కి మళ్లించినట్లు ఎయిరిండియా తెలిపింది. భారత్ నుంచి బయలుదేరిన వాటిని ఇతర మార్గాల్లో తిరిగి వెనక్కి రప్పిస్తున్నట్లు పేర్కొంది. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఎయిర్‌లైన్ తెలిపింది. ఎప్పటికప్పుడు తమ ప్రయాణికులకు అప్‌డేట్స్ ఇస్తామని, వారి క్షేమం, భద్రతే తమ తొలిప్రాధాన్యమని ఎయిరిండియా పేర్కొంది. గల్ఫ్ ప్రాంతం నుంచి ప్రయాణించే పలు ఎయిర్‌లైన్స్ సంస్థలు కూడా

తమ విమాన సర్వీసులను నిలిపివేశాయి. ఇప్పటికే బయలుదేరిన విమానాలను ఇతర మార్గాల్లోకి మళ్లించారు. అంతకుముందు కొచ్చి నుంచి ఖతార్‌లోని దోహాకు బయలుదేరిన ఎయిరిండియా విమానాన్ని మస్కట్‌కు దారి మళ్లించారు. కన్నూర్ నుంచి బయలుదేరిన మరో ఎయిరిండియా విమానం సైతం వెనక్కి వచ్చింది. మరోవైపు పశ్చిమాసియాలో తీవ్రమైన ఉద్రిక్తపరిస్థితుల వేళ దుబాయి, దోహా, బహ్రెయిన్, దామమ్, అబుదాబీ, కువైట్ తిబ్లిసీ నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన విమానాలు ఇండిగో విమానాలపై ప్రభావం పడింది. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఇండిగో పేర్కొంది. ఇరాన్ దాడులు ఆగిపోవడంతో బహ్రెయిన్, కువైట్‌లు తమ గగనతలాన్ని తెరిచాయి. తాత్కాలిక విరామంతో ఫ్లైట్ ఆపరేషన్స్ తిరిగి ప్రారంభమైనట్లు మీడియా వర్గాలు తెలిపాయి. దుబాయి ఎయిర్‌పోర్టు సైతం తిరిగి కార్యకలాపాలు ప్రారంభించింది. అయితే కొన్ని విమాన సర్వీసులు రద్దు కాగా, కొన్ని ఆలస్యంగా బయలుదేరనున్నాయి. ఈమేరకు దుబాయి మీడియా ఆఫీస్ పేర్కొంది.

సీటు విషయంలో ఎమ్మెల్యేతో వివాదం..

వందే భారత్‌లో ప్రయాణికుడిపై దాడి

విశ్వంభర, నేషనల్ బ్యూరో : సీటు మారేందుకు నిరాకరించిన వ్యక్తిపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దిల్లీభోపాల్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం ఈ ఘటన జరగ్గా.. దీనికి సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి రావడంతో వైరల్‌గా మారింది. ఈ ఘటనలో గాయపడిన ప్రయాణికుడిపైనే తిరిగి కేసు బనాయించడం గమనార్హం.ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజీవ్ సింగ్ గత వారం తన సొంత నియోజకవర్గానికి కుటుంబ సభ్యులతో కలిసి వందే భారత్‌లో ప్రయాణించారు. ఈ క్రమంలో భార్య, కుమారుడికి కంపార్ట్‌మెంట్ ముందు వరుసలో సీట్లు రాగా.. ఎమ్మెల్యేకి వేరే చోట సీటు వచ్చింది. ఈ క్రమంలో తన భార్యాబిడ్డలతో కలిసి ప్రయాణించేందుకు ఆ పక్కనే ఉన్న ప్రయాణికుడిని ఎమ్మెల్యే కోరగా.. అందుకు నిరాకరించాడు. ఇది జరిగిన కాసేపటికే ఝాన్సీ స్టేషన్‌లో ఎమ్మె

ల్యే మనుషులు ట్రైన్ ఎక్కి ఆ ప్రయాణికుడిపై పిడిగుద్దుల వర్షం కురిపించారు. ఆరుగురు వ్యక్తులు ప్రయాణికుడిని సీట్లోనే చెప్పులతో దాడి చేశారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి బయటికొచ్చింది.దాడి ఘటనలో భోపాల్ వెళ్తున్న సదరు ప్రయాణికుడు గాయపడ్డాడు. ముక్కు నుంచి రక్తం కారుతూ, దుస్తులపై రక్తం మరకలతో ఆ వ్యక్తి కనిపించాడు. సీటు విషయంలో తలెత్తిన వివాదంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విపుల్ కుమార్ ధ్రువీకరించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే, ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసేందుకు ప్రయాణికుడు నిరాకరించగా.. తన కుటుంబ సభ్యుల పట్ల అమర్యాదగా ప్రవర్తించాడని సింగ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఝాన్సీలోని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అతడిపై కేసు నమోదు చేయడం కొసమెరుపు.

దీనస్థితిలో డిప్యూటీ తహశీల్దార్

ఆస్పత్రి బిల్లులు మాఫీ చేయించిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ

విశ్వంభర, హైదరాబాద్: అనారోగ్యంతో ఆస్పత్రిపాలై బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్ ఖన్నాకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి అండగా నిలిచారు. తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్ పాకతో కలిసి సోమవారం ఆస్పత్రికి వెళ్లి రాజేశ్ ఖన్నాను పరామర్శించారు. అప్పటికప్పుడే ఆస్పత్రి బిల్లు సమస్యలను పరిష్కరించి డిశ్చార్జికి ఏర్పాట్లు చేశారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్ ఖన్నా తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. 25 రోజులకు రూ. 20లక్షలకు పైగా ఆస్పత్రి బిల్లు అయింది. అప్పటికే రూ.13లక్షలు వరకు కుటుంబసభ్యులు వివిధ రూపాల్లో డబ్బులు తెచ్చి బిల్లులను చెల్లించారు. మిగిలిన రూ.7లక్షలు చెల్లించే పరిస్థితి ఆ కుటుంబానికి లేకుండాపోయింది. రూ.7లక్షలు చెల్లిస్తేనే డిశ్చార్జ్ చేస్తామని ఆస్పత్రి వర్గాలు తేల్చి చెప్పాయి.రాజేశ్ ఖన్నా, అతడి కుటుంబ సభ్యుల దయనీయ స్థితి గురించి తెలుసుకున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి, రమేశ్ పాక ఆస్పత్రికి వెళ్లి వారికి ధైర్యం చెప్పారు. అన్ని రకాలుగా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

చికిత్స బిల్లుపై ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి మిగతా రూ.7లక్షలు మాఫీ అయ్యేలా చేశారు. అనంతరం రాజేశ్ ఖన్నాను డిశ్చార్జి చేసేలా ఏర్పాట్లు చేశారు.

ఎన్డీఎస్ఏ నివేదికను బీఆర్ఎస్ నేతలు తప్పుపట్టడాన్ని ఖండిస్తున్నా: ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

విశ్వంభర, హైదరాబాద్: కాళేశ్వరం అవినీతి నుంచి బయటపడేందుకు బీఆర్ఎస్ నేతలు అపసోపాలు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారాస అవినీతిపై ఆయన మీడియాతో మాట్లాడారు. భారాస నేతలారా.. కాళేశ్వరం ఎంత డొల్ల ప్రాజెక్టో ఎన్డీఎస్ఏ నివేదిక చదివి తెలుసుకోవాలన్నారు. ఐఐటీలో చదువుకున్న అత్యు

తన్న వేధావులు, నిపుణుల బృందం కాళేశ్వరం సందర్శించి లోపాలను ఎత్తిచూపిందన్నారు. ''కాళేశ్వరంలో జరిగిన అక్రమాలు, నాణ్యతా లోపాలు, మొరాయించిన మోటార్లు, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎన్డీఎస్ఏ స్పష్టంగా వెల్లడించింది. అయినా ఎన్డీఎస్ఏ నివేదికను భారాస నేతలు తప్పుపట్టడాన్ని ఖండిస్తున్నా. పీసీ ఘోష్ కమిషన్ విచారణ సందర్భంగా భారాస నేతలు కారుకూతలు కూశారు. భారాస నేతల అవినీతిని భాజపా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరగాలని రాహుల్ గాంధీ చెప్పిన మాటలు మర్చిపోయారా? అసెంబ్లీ లోపల, బయట కూడా సీఎం, మంత్రులు కాళేశ్వరం అవినీతిపై మాట్లాడారు కదా?పీసీ ఘోష్ కమిషన్ విచారణను నీరుగార్చేందుకు కుట్ర జరుగుతోంది. భారాస చేసిన తప్పులకు శిక్షణ అనుభవించక తప్పదు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా''అని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు.

లాటరీ పేరుతో వేల మందికి కుచ్చుటోపి

రూ. కోట్లతో ఉడాయించిన వ్యాపారులు

విశ్వంభర, మిర్యాలగూడ: లాటరీ పేరుతో ఆకర్షణీయమైన ఆఫర్ల ఆశ చూపి వేలాది మందికి రూ.కోట్లలో కుచ్చుటోపి పెట్టిన ఘటన సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన రమేశ్, కోటేశ్వరరావు, శ్రీనివాస్ కలిసి ఆర్కే ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఓ సంస్థను స్థాపించారు. నెలకు రూ.వెయ్యి చొప్పున 15 నెలల పాటు చెల్లించేలా ప్లాన్‌ను ప్రవేశపెట్టారు. ప్రతినెల డ్రా తీసి పది మంది విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తామని ప్రకటించారు. వీరి మాటలు నమ్మి పది మంది ఏజెంట్లుగా మారారు. ఏజెంట్ల ద్వారా సంస్థ నిర్వాహకులు ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్ ఏపీలోని తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 2,600 మందిని సభ్యులుగా చేర్పించుకున్నారు. సుమారు రూ.4 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. లాటరీ స్కీమ్‌లో భాగంగా కొంతమంది డ్రా విజేతలకు బహుమతులు అందించిన నిర్వాహకులు.. అనంతరం మొహం చాటేసారు. జనవరి నెలతో స్కీమ్ పూర్తి కాగా అప్పటినుంచి సభ్యులకు వస్తువులు అందించేందుకు కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో బాధితులు మిర్యాలగూడ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోతీరాం తెలిపారు.

తక్కువ ధరకే బంగారం పేరుతో మోసం

.. నిందితుడి అరెస్టు

విశ్వంభర, హైదరాబాద్: తక్కువ ధరకు బంగారం పేరుతో మోసగిస్తున్న నిందితుడిని అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. తక్కువ ధరకు బంగారం విక్రయిస్తామంటూ ముగ్గురు ముఠా సభ్యులు అమాయకులకు టోకరా వేశారు. బాధితుల వద్ద రూ.40 లక్షలు తీసుకొని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు జయ కుమార్‌ను అరెస్టు చేసి.. అతడి వద్ద నుంచి రూ.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నిందితులు ఉదయ్, సందీప్ కోసం గాలిస్తున్నారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు నిందితులు అరెస్టు..

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్ సహా ముగ్గురు నిందితులను టీజీ న్యాబ్, నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.30 లక్షల విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విక్టర్, రాజేశ్, వీరరాజుగా గుర్తించారు. రాజేశ్ అనే నిందితుడు మే 29న మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో రేవ్‌పార్టీకి డ్రగ్స్ సరఫరా చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మోకిలాలో ఫనిరాజ్ అనే వినియోగదారుడికి 5 గ్రా. కొకైన్ సరఫరా చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీ షర్ట్స్, టై,బెల్ట్ లు పంపిణీ

విశ్వంభర, మహబూబాబాద్ : తెలుగు సమితి అఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ సమితి వారి ఆధ్వర్యంలో చక్రి జన్మ దినం సందర్భము గా మహబూబాబాద్ మండలం ,రెడ్యాల ప్రాథమికొన్నత పాఠశాల నందు ఏకరూప టీ షర్ట్స్ పంపిణీమరియు టై బెల్ట్ లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయులు పాక రాజేశ్వరి మాట్లాడుతూ స్ఫూర్తి ఫౌండేషన్ వారు ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులపై చూపించే ఔదార్యానికి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. అదేవిధంగా మినిమమ్ వెజెస్ అడ్వైజరి బోర్డు మాజీ చైర్మన్ సామ వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లి తండ్రులు ప్రభుత్వ పాఠశాల పై నమ్మకము ఉంచి పాఠశాల లో చేర్పించాలన్నారు భవ్యస్తూ లో కూడా పాఠశాలకు నా వంతు సహకారం ఉంటుంది అని తెలిపారు స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామసహాయం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు అన్ని రకాలుగా సహకారం అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు బుధవారము, శనివారము వేసుకునే విధంగా ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ప్రవేట్ పాఠశాల దీటుగా ప్రభుత్వ పాఠశాల ఉండే విధం గా ఏకరూప టీ షర్ట్స్ మరియు టై బెల్ట్ లు అందివ్వడం జరగింది అని అన్నారు ప్రభుత్వ పాఠశాల పై నమ్మకము ఉంచి విద్యార్థుల ను పాఠశాల లలో విద్యార్థుల ను చేర్పించాలన్నారు .ఈ కార్యక్రమంలో కంబాలపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉప్పలయ్య స్ఫూర్తి ఎడ్యుకేషన్ కోశాధికారి ఆకుల శ్రీకాంత్ తెలంగాణ సాం స్కృతిక కళా బృందం అధ్యక్షులు కొలిశెట్టి సత్యనారాయణ ఉపాధ్యాయులు సరిరాం విజయ రజిత ఉమ శివ నవీన ప్రత్యుస పాల్గొన్నారు.